క్లుప్తంగా

ఎస్‌ఎంసీ చైర్మన్‌కు సత్కారం



కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న కృష్ణ చైతన్య

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన సనపల రమేష్, సియాద్రి సురేష్‌లను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య సత్కరించారు. చైతన్యను కలిసేందుకు కమిటీ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం మబగాం వెళ్లారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. స్కూల్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బాది ఈశ్వరరావు, తోట భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలతో తరగతి గదుల నిర్మాణం



నూతన తరగతి గదుల వద్ద ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత దృష్ట్యా, విరాళాలతో రెండు అదనపు తరగతి గదులు నిర్మించినట్లు స్కూల్ హెచ్‌ఎం హర్షవర్దన్ శర్మ తెలిపారు. వీటిని శుక్రవారం ప్రారంభించామన్నారు. దీనికోసం రూ.2.26 లక్షలు వెచ్చించామని పేర్కొన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఒకరు రూ.40 వేలు ఇవ్వగా, మిగిలిన మొత్తాన్ని స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బందిని నుంచి సేకరించినట్లు వెల్లడించారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న రవికుమార్

పాతపట్నం: నిరుద్యోగ యువతకు చేయూత అందించడమే లక్ష్యమని వ్యాపారవేత్త కొరికాన రవికుమార్ అన్నారు. స్థానిక అంతరాబ కూడలిలోని హోండా షోరూంపైన కొరికాన కాంపిటేటివ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులు శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అకాడమీ డైరెక్టర్ భవానీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చదువుకుంటున్న యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకులు విశ్వేశ్వరరావు, దుర్గారావు, సూర్యప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'కార్యదర్శుల వద్ద పూర్తి సమాచారం ఉండాలి'



శిక్షణా తరగతులు పరిశీలిస్తున్న కృష్ణమోహన్

సరుబుజ్జిలి: పంచాయతీ కార్యదర్శుల వద్ద వారి పంచాయతీలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ శిక్షణా తరగతులను శుక్రవారం పరిశీలించారు. శిక్షణకు సర్పంచ్‌లు తక్కువగా హాజరవ్వడంపై అధికారులను ప్రశ్నించారు. శిక్షణ కార్యక్రమాల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీకి సంబంధించిన జనాభా, పురుష, మహిళల వివరాలు, పంచాయతీ ఆదాయ వనరులు గురించి పూర్తి స్థాయి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పరిశీలనలో జిల్లా శిక్షణా మేనేజర్ ఎస్.లోకనాథం, ఎంపీడీవో మేనక రత్నం తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా రుషి



నియామకపత్రం అందుకుంటున్న రుషి

మెళియాపుట్టి: సమాచార హక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడిగా పెద్ద పద్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉర్లాన రుషి ఎంపికైనట్లు శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నియామకపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

కొత్తూరు: పట్టణంలో సినీ నటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం బైక్ ర్యాలీ చేపట్టారు. 09పీటీఎం66: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు

ఇంటి వద్దకే అందజేయాలి



కొండల్లో ఉంటున్న గిరిజన లబ్ధిదారులకు ప్రతినెలా ఇప్పుడు ఉన్న పద్ధతి ప్రకారం రేషన్ సరుకులు ఇంటి వద్దకే అందజేయాలి. రేషన్ బియ్యం ఇచ్చే వ్యాన్ డ్రైవర్ ఒక రోజు ముందుగానే పలానా తేదీన మీ ఊరికి వచ్చి బియ్యం ఇస్తానని చెప్తున్నారు. ఆరోజు వ్యాన్ వచ్చేసరికి రేషన్ కార్డులు పట్టుకుని అందరం ఊరులో ఉంటాం. ఒక రెండు గంటల్లో బియ్యం ఇచ్చి వ్యాన్ డైవర్ చక్కగా వెళ్లిపోతున్నారు.

– సవర గంగయ్య, గిరిజనుడు, మురగడలోవ, ఎల్.ఎన్.పేట

ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి



ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ పథకాన్ని నిలిపివేస్తున్నట్లు టీవీల్లో చూశాను. పాత పద్ధతిలో మరలా ఇస్తే కొండల్లో నుంచి కిందికి వచ్చి సరుకులు తీసుకుని వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉన్న పద్ధతి ప్రకారం వ్యాన్ల ద్వారా గిరిజన గ్రామాలకు రేషన్ సరుకులు అందించాలి. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలి.

– సవర అనపయ్య, గిరిజనుడు, కారిగూడ, ఎల్.ఎన్.పేట

నానా ఇక్కట్లు పడాల్సి వస్తుంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ బండ్ల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించేవారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది. అయితే ఇటీవల వచ్చిన వార్తల్లో ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దు చేస్తారని తెలుస్తోంది. ఇలా అయితే మేము నానా ఇక్కట్లు పడాల్సి వస్తుంది. మా గ్రామానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో తిమ్మాపురం గ్రామం ఉంది. ఆ గ్రామంలో రేషన్ డీలర్ షాప్ ఉంది. అక్కడికి ప్రతినెలా మేము ఇంటి నుంచి పనులు మానుకొని వెళ్లాల్సి వస్తుంది. అది కూడా ఆ డీలర్ అవకాశం ఉన్నప్పుడు ఇస్తారు. లేదంటే మళ్లీ తిరిగి ఇంటికి రావాలి. ఇది చాలా ప్రాయాసతో కూడుకున్న పని.

– బుంగ గోవిందరావు, ఖైరిశాస్త్రులపేట, ఆమదాలవలస

పునరాలోచన చేయాలి



గత ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ పథకం ద్వారా రేషన్ సరుకులు అందజేసి ఇబ్బందులు లేకుండా ఆదుకునేవారు. ఆ సదుపాయాన్ని ఇప్పుడు రద్దు చేస్తే ఇబ్బందులు ఏర్పడుతాయి. ఇలా పథకాన్ని రద్దు చేస్తే గిరిజన గ్రామాల ప్రజలకు తీవ్రమైన సమస్య తలెత్తుతుంది. కొండ మీద నుంచి కిందకి దిగి రేషన్ సరుకులు డీలర్ల ద్వారా తీసుకోవడం అంటే చాలా సమస్యగా ఉంటుంది. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– పొలక దమయంతి, బొడ్లపాడు గిరిజన గ్రామం, బూర్జ మండలం

పరేషన్..! ఇక తప్పదా?

- ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ రద్దు..?
- పాత పద్ధతిలో పంపిణీకి చర్యలు
- పాత రోజులు వస్తాయని ప్రజల ఆందోళన

'ఇంటి వద్దకే రేషన్' ఇది గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం. అప్పటి వరకు సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ, ప్రయాసలకు లోనైన ప్రజలకు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే నాణ్యమైన బియ్యం అందజేశారు. దీంతో తమకు మంచి రోజులు వచ్చాయని ప్రజలు ఆనందంగా రేషన్ తీసుకునేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ రద్దు చేయనున్నట్లు ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం సూచన చేసింది. దీంతో మరలా మునపటి కష్టాలు ఎదురవుతాయని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పాత పద్ధతిలోనే రేషన్ డీలర్ల ద్వారా డిపోల వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో రోజంతా తాము పనులు మానుకొని ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: ఎండీయూ వాహనాలు లేని రోజుల్లో రేషన్ సరుకులు తెచ్చుకుంటున్న గిరిజనులు (ఫైల్‌ఫోటో)



ఎల్ఎన్‌పేట: రేషన్ వాహనం వద్ద ఇంటి వద్దనే బియ్యం తీసుకుంటున్న దృశ్యం

ప్రస్తుత పద్ధతే బాగుంది



రేషన్ బియ్యం పంపిణీకి ప్రస్తుతం అమలు చేస్తున్న విధానమే బాగుంది. దీనినే కొనసాగించాలి. వాహనాలను తొలగించి మునిపటిలా డీలర్ల వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాలని ప్రభుత్వం భావించడం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వం పునరాలోచించాలి. ప్రస్తుత విధానం వలన ఖర్చు అధికంగా ఉందని ప్రభుత్వం భావిస్తే మరింత దగ్గరగా సరుకులు అందేవిధంగా చర్యలు తీసుకోవాలి తప్ప కష్టాలు పెంచడం సరైన చర్య కాదు

– అంపోలు సునీలత, చోడవరం, నరసన్నపేట

2 కి.మీ వెళ్లాలి



మాది సారవకోట మండలం చిన్నకిట్టాలపాడు పంచాయతీ సవర కురిడింగి గ్రామం. 2019 వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నకిట్టాలపాడు రేషన్ దుకాణానికి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేవాళ్లం. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ సరుకులను గ్రామంలోకి వాహనం ద్వారా తీసుకొచ్చి పంపిణీ చేసేవారు. దీంతో వ్యయ, ప్రయాసలు తగ్గాయి. కానీ మరలా ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలను తొలగిస్తామని ప్రకటించింది. దీంతో గతంలో మాదిరిగా మరలా 2 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన దుస్థితి వస్తుంది.

– బొంతు వెంకటరావు, సవరకురిడింగి, సారవకోట మండలం

నరసన్నపేట నియోజకవర్గం సమాచారం

మండలం	రేషన్‌కార్డులు	రేషన్ డిపోలు	వాహనాలు
నరసన్నపేట	23,537	53	13
పోలాకి	21,209	50	13
జలుమూరు	19,217	53	13
సారవకోట	16,485	45	12

పాతపట్నం నియోజకవర్గం

మండలం	రేషన్‌కార్డులు	రేషన్ డిపోలు	వాహనాలు
కొత్తూరు	22,634	61	17
పాతపట్నం	20,299	47	14
మెళియాపుట్టి	16,675	44	12
హిరమండలం	12,241	31	09
ఎల్.ఎన్.పేట	10,961	36	07

ఆమదాలవలస నియోజకవర్గం

మండలం	రేషన్‌కార్డులు	రేషన్ డిపోలు	వాహనాలు
ఆమదాలవలస	25,835	78	13
బూర్జ	13,601	49	09
సరుబుజ్జిలి	9,900	40	06
పొందూరు	22,775	62	13

కష్టాలు మొదలవుతాయి



ఏ ప్రభుత్వమైనా ఆధునిక పద్ధతులు పాటించి, లబ్ధిదారులకు మరింత సులువుగా పథకాలు అమలు చేసి అందించడానికి చూడాలి. అంతేగానీ మరిన్ని కష్టాలు తెచ్చేలా నిర్ణయాలు తీసుకోకూడదు. టీడీపీ ప్రభుత్వం తీరు చూస్తుంటే ఇలానే ఉంది. ఇప్పటివరకు రేషన్ సరుకులు ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో డీలర్లు వద్దనే సరుకులు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తుండటం విచారకరం. దీంతో రేషన్ కష్టాలు మళ్లీ మొదలవుతాయి.

– పి.అప్పన్న, పారశిల్లి, నరసన్నపేట

'అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం'



హిరమండలం: నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహంపై గురువారం రాత్రి టీడీపీ నేతల ప్రోద్బలంతో కొందరు దుండగులు దాడి చేయడం హేయమని పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, కొత్తూరు ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దూలి అప్పన్నలు అన్నారు. దాడికి నిరసనగా స్థానిక నాలుగు రోడ్లు కూడలి వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ప్రపంచమే మెచ్చుకునే విధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరిచారనే అక్కసుతో ఆయన పేరు తొలగించారన్నారు. పేర్లు తొలగించడానికి అంబేడ్కర్ విగ్రహాన్ని సుత్తితో పాటు ఇతర పరికరాలతో కొట్టడం



కొత్తూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాతపై ఇటువంటి చర్యలను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో గండివలస ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ బాలకృష్ణ, యర్లంకి ధర్మారావు, నాగేంద్ర, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ మాజీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, పంకజదాస్, ఎండు నాయుడు, బి.నగేష్, అశోక్ కుమార్, పాపారావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన'

హిరమండలం: రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, జేఏసీ కమిటీ అధ్యక్షుడు ఏవీ సురేష్‌లు అన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంలో విగ్రహంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తొలగింపునకు నిరసనగా శుక్రవారం ఆందోళన చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎంగా ఉన్నప్పుడు జగన్ ఏర్పాటు చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ దళితులకు అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక పాలన అవలంభిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వంగపల్లి చిన్నారావు, సర్పంచ్‌లు ముకాళ్ల చిన్నయ్య, వంజరాపు చిరంజీవి, వంజరాపు జ్యోతి, పొట్నూరు సింహాచలం, మీసాల రామారావు, పతివాడ వెంకటరమణ, పతివాడ అప్పలనాయుడు, కేలం నరసింహమూర్తి, వాకాడ నరసింహారెడ్డి, నక్క ఆనందరావు, జి.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి'



నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

పాతపట్నం: గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని, సాంప్రదాయక ఆదివాసులను కాపాడాలని జిల్లా ట్రెజరీ (ఎస్‌టీఓ) ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఆదివాసీ భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినంగా 1994లో ఐక్యరాజ్య సమితి ప్రకటన చేసిందన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ బి.ప్రసాదరావు, సీఎస్‌డీటీ భీమారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గురాడి అప్పన్న, గిరిజన నాయకులు బి.సింహచలం, రామారావు, సంపతిరావు, పార్వతీశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

పొందూరు: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తప్పవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వారిపై నిఘా పెట్టామన్నారు. పొందూరులో పెరుగుతున్న గంజాయి వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని ఎస్ఐ వీవీ రమణను ఆదేశించారు. మండలంలో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న క్వారీలు, సమయం పాటించకుండా



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

జరుపుతున్న పేలుళ్లకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు.

మర్రి చెట్టును ఢీకొన్న లారీ

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గ్రామ సమీపంలో ఓ భారీ లారీ చెట్టును ఢీకొట్టింది. పర్లాఖిమిడి వైపు నుంచి శుక్రవారం పలాస వెళుతున్న ఓ భారీ లారీ తూముకొండ పెద్దమడి గ్రామాలకు మధ్యలో ఉన్న ఓ పెద్ద మర్రి చెట్టు కొమ్మకు ఢీకొని ఆగిపోయింది. మర్రి కొమ్మ తగిలి లారీ పైభాగం పాడైపోయింది. చెట్టుకు అవలి వైపు కరెంట్ తీగలు ఉన్నాయి. వెంటనే స్థానికంగా ఉన్న కొంతమంది యువత స్పందించి మర్రికొమ్మను కట్టర్‌తో కోసి పక్కకు తప్పించారు. కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నాటుసారా స్థావరాలపై దాడులు

మెళియాపుట్టి: మండలంలోని ముత్యాలబొంతు గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ బృందాలు పోలీసుల సమన్వయంతో సారా తయారీ స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు, పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకొస్తాం'

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మరుగుదొడ్లు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకు వస్తామని నాడు–నేడు ఏఈ కిరణ్ తెలిపారు. పాఠశాలలో టాయిలెట్లను ఏఈ శుక్రవారం పరిశీలించారు. అబ్బాయిలకు మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో పాఠశాల బయటకు వెళ్లిన విద్యార్థుల మధ్య ఇటీవల జరిగిన కొట్లాటలో ఒక విద్యార్థి చేయి విరిగిన ఘటనపై అధికారులు స్పందించారు. తక్షణమే టాయిలెట్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఏఈ కిరణ్

ఆయనతో పాటు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఈశ్వరాచారి ఉన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

పాతపట్నం మండలంలోని లాబర గిరిజన ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐటీడీఏ పీవో రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్యనారాయణ , ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

– పాతపట్నం



ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

ఆమదాలవలస: ప్లాస్టిక్‌ను విరివిగా వినియోగించడం వలన అనర్థాలు సంభవిస్తున్నాయని ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సన్యాసిరావు అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో జరుగుతున్న గోగు నార ఆధారిత విలువ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించి గోగు, జనపనారతో తయారుచేసిన చేతి సంచులను వినియోగించాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో జరిగే అనర్థాలు, వాయు కాలుష్యం, జల కాలుష్యంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన అధిపతి డాక్టర్



మాట్లాడుతున్న సన్యాసిరావు

జి.చిట్టిబాబు మాట్లాడుతూ శిక్షణ అనంతరం స్వయం ఉపాధి వైపు ఆలోచన చేయాలని, అలాగే ఇతర యువతకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.స్వాతి, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ బస్సు, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులే కీలకం

ఆమదాలవలస: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులే కీలకమని ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు అన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండోరోజు శుక్రవారం మండలంలోని అక్కులపేట గ్రామంలో పర్యటించారు. గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి వసుమతి ఆధ్వర్యంలో చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీ విధానము, ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై శిక్షణను ఇచ్చారు. శిక్షణ కార్యక్రమం కో–ఆర్డినేటర్‌గా ఎంపీడీవో వాసుదేవరావు, అసిస్టెంట్ కోర్స్ కో–ఆర్డినేటర్‌గా ఈవోపీఆర్డీ డి.గోవిందరావు, రిసోర్స్ పర్సన్స్‌గా బి.నాగరాజు, బి.స్టాలిన్, వి.విక్రమ్,



చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న దృశ్యం

పి.రాము, టి.అభిలాష్ తదితరులు వ్యవహరించారు.

బూర్జ: పంచాయతీల్లో సర్పంచ్‌లే కీలకమని ఇన్‌చార్జి ఎంపీడీవో యు.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా రెండో రోజు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ పి.విజయలక్ష్మి మాట్లాడుతూ రిఫ్రెషర్ పంచాయతీ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన

పాతపట్నం: పాతపట్నం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 257–3లో రెండు ఎకరాల 88 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు రికార్డుల్లో తారుమారు చేశారని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అనపాన షణ్ముఖరావు ఆరోపించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్‌కు బాధితులు టొక్క పార్వతి, అప్పారావు, అనిల్‌లతో కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యాలయం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఆశయ



నిరసన తెలుపుతున్న దృశ్యం

సాధన సమితి నాయకులు లత, శ్యామల్, రష్మిత, రోహిత్, జయదాసు, కళ తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాలకు సిద్ధమవ్వాలి'

కొత్తూరు: గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం గిరిజనులు ఐక్య పోరాటాలకు సిద్ధమవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం గొట్టిపల్లి గిరిజన గ్రామంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో అప్పన్నతో పాటు పలువురు గిరిజన నేతలు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా ఇంత వరకు గిరిజనుల బతుకులు మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సదస్సులో గిరిజన నేతలు ఆరిక శివ, గంగమ్మ, పాలక శివ, పురుషోత్తం, నిమ్మక సంతోష్, తులసమ్మ, రత్నాలమ్మ తదితరులు పాల్గొన్నారు.